నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 31 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# ఊరూరా ఉగాది వేడుక

- విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలికిన ప్రజలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. పంచాంగ శ్రవణాలు
- పలుచోట్ల పాల్గొన్న ప్రజాప్రతినిధులు



విశ్వనాథాలయంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు పూజలు



ఉగాది వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య

**నమస్తే నెట్‌వర్క్:** ఊరూరా ఉగాది వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ.. ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పచ్చడి, పిండి వంటలను దేవుళ్లకు నైవేద్యంగా సమర్పించారు. తమ జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల వేదికలు ఏర్పాటు చేయగా, పండితులు పంచాంగ పఠనం చేసి.. రాసి ఫలాలు వివరించారు. మంచిర్యాలలోని తమ నివాసంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, జిల్లా డీసీసీ అధ్యక్షురాలు సురేఖ దంపతులు అధికారులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి వేడుకలు నిర్వహించారు. పంచాంగ శ్రవణ కార్యక్రమానికి కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశీష్ సింగ్, పోలీస్ అధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, రాజకుమారి దంపతులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజిత్‌రావు-ఉదయ శ్రీ దంపతులు ఆలయాల్లో పూజలు చేశారు. బెల్లంపల్లిలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య, ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఉగాది వేడుకలు నిర్వహించారు.



గొల్లపల్లిలో ఎండిన చేద బావి

# గొంతెండుతున్న గొల్లపల్లి

- కొన్ని వాడలకే భగీరథ జలం
- అడుగంటిన బావులు.. చెడిపోయిన చేతిపంపులు
- నీటికోసం పడరాని పాట్లు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



గొల్లపల్లిలోని వడ్ల వాడలో చెడి పోయిన పంపు వద్ద మహిళలు

నెన్నెల, మార్చి 30 : గొల్లపల్లి గ్రామంలో 50 కుటుంబాలు ఉన్నాయి. ఆరు చేదబావులు, మూడు చేతి పంపులు ఉన్నాయి. ఇంటింటికీ మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఎండలు ముదరడంతో చేదబావుల్లో నీళ్లు అడుగంటి పోయాయి. ఇక మిషన్ భగీరథ జలాలు కొన్ని వాడలకే అందుతున్నాయి. కొందరు ప్రధాన పైపులైన్‌కు నేరుగా పెద్ద పెద్ద పైపులు పెట్టి నీటిని వాడుకోవడం వల్ల మిగతా కాలనీలకు చేరడం లేదు. మరికొందరు పెరటి తోటలకు సైతం నీటిని వినియోగించుకుంటున్నారు. గతంలో ఒక చేతిపంపునకు మోటర్ ఏర్పాటు చేసి ఇంటింటికీ పైపుల ద్వారా నీరు సరఫరా చేశారు. కానీ.. మోటర్ చెడిపోవడంతో మూడు నెలల నుంచి మరమ్మతులకు నోచుకోవడం లేదు. కొన్ని వాడల్లోని బావుల్లో నీరుండగా, అక్కడికి వెళ్లి తెచ్చుకుందామంటే ఇతర కాలనీల వాసులను రానీయడం లేదు. ప్రధానంగా వడ్ల వాడ, హనుమాన్ టెంపుల్ ఏరియా, ఎస్సీ కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉన్నది. తాగడానికి కష్టపడి ఎలాగోలా కష్టపడి నీరు తెచ్చుకుంటున్నప్పటికీ ఇంటి అవసరాలకు మాత్రం అష్టకష్టాలు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సమస్య తీర్చాలని అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామని, వారు కనికరించడంలేదని వారు చెబుతున్నారు. ఇకనైనా స్పందించి తమ గోస తీర్చాలని కోరుతున్నారు.

*ఆ ఊరి ప్రజానీకం గొంతు తడుపుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నది. మిషన్ భగీరథ జలం అందక.. చేతి పంపులు పనిచేయక గుక్కెడు నీటి కోసం వాడల వెంట తిరగాల్సిన దుస్థితి నెలకొన్నది. సమస్య పరిష్కరించండి మహాప్రభో అంటూ మొరపెట్టుకున్నా పట్టించుకునే దిక్కులేకుండా పోయింది.*

## మూడు నెలల సంది తిప్పలైతంది



నీళ్లకోసం మూడు నెలల సంది తిప్పల పడుతున్నం. ఎవరికీ చెప్పినా పట్టించుకోవడం లేదు. మిషన్ భగీరథ నీళ్లు కూడా రావడం లేదు. కొందరు ప్రధాన పైపులైన్‌కు పెద్ద పెద్ద పైపులు పెట్టి కూరగాయలు పండించుకుంటున్నా పట్టించుకున్నోళ్లు లేరు. పైపులైన్ మంచిగ లేక మా వాడకు చుక్క నీరు వస్తలేదు. రెండు మూడు రోజులకోసారి నల్ల ఇస్తున్నా బిందె నిండాలంటే అర గంట పడుతుంది. మా ఇంటి పక్కనున్న బావి ఎండిపోయింది. ఇకనైనా మా గోస పట్టించుకోవాలి.

*- టకిరే నాగమ్మ, గొల్లపల్లి*

## బావులు ఎండి పోయినయి



మా వాడలోని బావులు ఎండిపోయినయి. నీళ్లకోసం పనులన్నీ వదులుకొని పక్క వాడలకు వెళ్లాల్సి వస్తున్నది. చేతిపంపునకు ఏర్పాటు చేసిన మోటర్ చెడిపోయి మూడు నెలలవుతున్నా మంచిగ చేపించినోళ్లు లేరు. అది మంచిగుంటే 20 కుటుంబాలకు నీళ్లు వచ్చేవి. ఇప్పుడే గిట్లుంటే ఇంకా ఎండలు ముదిరితే మా పరిస్థితి ఎట్లనో తల్సుకుంటనే భయమైతంది. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు మా బాధ పట్టించుకోవాలి.

*- కల్వచర్ల అమృత, గొల్లపల్లి*

# తాగు నీటికి తల్లడిల్లుతున్నా పట్టదా?

**బావురావుపేట ఎస్సీ కాలనీ వాసుల ఆవేదన**



వ్యవసాయ బోరు పంపు వద్ద నీళ్లు పట్టుకొని వస్తున్న మహిళలు

చెన్నూర్ రూరల్, మార్చి 30 : బావురావుపేట గ్రామంలోని ఎస్టీ కాలనీ వాసులు తాగు నీటి కోసం అల్లాడుతున్నారు. ఇక్కడ సుమారు 50 కుటుంబాలు ఉన్నాయి. మిషన్ భగీరథ నిర్వహణ సరిగా లేక నీరు సరిగా రావడం లేదు. రెండు బోర్లు ఉండగా, ఒకదానికి అమర్చిన మోటర్ నాలుగు నెలల కింద చెడిపోయింది. మరో బోరులో నీళ్లు లేవు. తప్పనిసరి పరిస్థితుల్లో కిలో మీటర్ దూరంలోనున్న వ్యవసాయ బోరు పంపు వద్దకు కాలినడకన వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఒక్కోసారి రైతులు రానీయకపోవడంతో పాఠశాల వద్దకు వెళ్లి మిషన్ భగీరథ, చేతిపుంపు నీరు తెచ్చుకుంటున్నారు. తాగు నీటి కోసం నాలుగు నెలలుగా తిప్పలు పడుతున్నా పట్టించుకునే నాథుడు లేడని, తమ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చెన్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ విషయమై ఎంపీడీవో మోహన్‌ను వివరణ కోరగా.. ఇక నుంచి ప్రతి రోజూ మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చూస్తామని, బోర్లకు అమర్చిన మోటర్లకు మరమ్మతులు చేస్తామన్నారు.



గ్రామంలో చెడిపోయిన బోరు



ఈ నెల 28న ఎంపీడీవో కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

## మస్తు గోస పడుతున్నం



తాగునీటికి మస్తు తిప్పలైతంది. కిలోమీటరు దూరం నడిచి పొలాల కాడ బోరు నీళ్లు తెచ్చుకుంటున్నం. ఇంట్లకు.. బైటకు గోస పడుతున్నం. రైతులు మోటర్లు బంద్ పెట్టినప్పుడు ఇగ ఆ బాధ చెప్పుకోలేము. మంచిర్యాల దాక పోయి సార్లకు చెప్పినా పట్టించుకున్న దిక్కులేదు. ఇకనైనా మాకు నీళ్లిస్తరో లేదో..

*- గట్టు అరుణ, బావురావుపేట*



## మా గోస తీర్చాలి



కాలనీలోని బోరు మోటర్ కాలిపోయి నాలుగు నెలలైతంది. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. బిందెలు పట్టుకొని పోయి పొలాల కాడ నీళ్లు తెచ్చుకుంటున్నం. రోజుకు ఐదారు సార్లు పొలాల పొంటి తిరగాల్సి వస్తున్నది. ముసలోళ్లు గట్ల మీద నడిచేందుకు ఇబ్బంది పడుతున్నరు. ఇకనైనా నీళ్ల గోస తీర్చాలి.

*- గావిడి పోసక్క, బావురావు పేట*

# మరమ్మతులు చేస్తూ.. తాగు నీరందిస్తూ..

**● 'నమస్తే'కు స్పందన**

*బెజ్జూర్, కుకుడ, నాగుల్వాయి, కుశ్నపల్లి తదితర గ్రామాలకు ప్రజలు మిషన్ భగీరథ నీరందక తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, ఈ నెల 20న 'నమస్తే తెలంగాణ'లో 'భగీరథ ప్రయత్నం' పేరిట కథనం ప్రచురితమైంది. ఇందుకు మిషన్ భగీరథ ఏఈ అభిలాష్ స్పందించారు. గత నాలుగు రోజులుగా ఆయా గ్రామాల్లో పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తూ లీకేజీలను అరికడుతున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లోని కొన్ని వాడలకు తాగు నీరు సరఫరా చేస్తున్నారు. ఒకటీ రెండు రోజుల్లో అన్ని గ్రామాలకు సరిపడా నీరందిస్తామని ఏఈ అభిలాష్ తెలిపారు. ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని.. అప్పటికప్పుడు పరిష్కరించి తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. కాగా, తాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'నమస్తే తెలంగాణ' దినపత్రికకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. - బెజ్జూర్, మార్చి 30*



బెజ్జూరులో పైపులైన్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది



మరమ్మతుల తర్వాత వస్తున్న నల్లా నీరు

# 'భగీరథ' కోసం ఎదురుచూపు

*కుట్టభద్రలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతో తాగు నీరు సరఫరాకాక ప్రజలు అవస్థలు పడుతున్నారు. వారం రోజులుగా మరమ్మతులు చేపట్టే వారు లేక గుక్కెడు నీటి కోసం తల్లడిల్లుతున్నారు. గ్రామ సమీపంలో ఉన్న ఒకే ఒక్క బావి వద్దకు చేరి బారులు తీరి గొంతు తడుపుకుంటున్నారు. మరి ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందిస్తారో లేదో వేచి చూడాలి మరి. - లింగాపూర్ మార్చి 30*



బావిలో నీళ్లు తోడుతున్న గ్రామస్తులు

# నేడు ఈద్-ఉల్-ఫితర్



*ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సోమవారం ఈద్-ఉల్-ఫితర్‌ను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నెల రోజుల పాటు రంజాన్ ఉపవాస దీక్షలు చేసిన ముస్లిం సోదరులు నేడు ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు చేయనున్నారు. ఇమామ్‌లు ఇచ్చే సందేశాలను (ఖుత్బా) విని ఒకరికొకరు అలాయి.. బలాయి (ఆలింగనాలు) తీసుకొని ఇంటికి తిరుగుపయనం కానున్నారు. - దండేపల్లి, మార్చి30*



బోరు వద్ద మహిళలు

# బోరు పాడైపోయింది.. బాగు చేయరూ..!

*పొలంపల్లి గ్రామ పంచాయతీ సమీపంలోని కాలనీలో బోరు మోటరు కాలిపోయింది. మరమ్మతులు చేపట్టే నాథుడు లేకపోవడంతో స్థానికులు తాగు నీటితో పాటు ఇంటి అవసరాలకూ ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. తప్పనిసరి పరిస్థితుల్లో పక్క కాలనీలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బోరు మోటరుకు మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు. - భీమారం, మార్చి 30*





